www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 13 అక్టోబర్ 2023
5
అన్నమయ్య

'మడితాటి'కి ప్రధాని నుంచి ప్రశంసా పత్రం

ప్రశంసా పత్రంతో మడితాటి

రాయచోటి: సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న మడితాటి నరసింహారెడ్డికి గురువారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నుండి ప్రశంసా పత్రం అందింది. విద్యార్థులలో ఒత్తిడి లేని వాతావరణాన్ని కల్పించడానికి నిర్వహించిన 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి విలువైన సూచనలు చేశారని అందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ప్రశంసా పత్రంలో ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కలలు కనేలా, ఆ కలలను సాకారం చేసేందుకు అవని సామర్థ్యాలను సక్రమంగా ఉపయోగించేలా ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, విద్యార్థుల అభివృద్ధి కోసం 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో తాను పంచుకున్న ఆలోచనలు, అభిప్రాయాలు చాలా విలువైనవని పేర్కొంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నుండి ప్రశంసాపత్రం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రశంసా పత్రాన్ని తన జీవితంలో అత్యంత విలువైనదిగా భావిస్తున్నానన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

-కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే చింతల

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే చింతల

ప్రజాశక్తి-కలికిరి

ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వం లక్ష్యమని కలెక్టర్ గిరీష, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జగనన్న కాలనీ ప్రారంభోత్సవం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో జగనన్న కాలనీల రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ సొంత ఇంటి కల కోసం పేద ప్రజలు బడుగు బలహీన వర్గాలు ఇబ్బంది పడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సొంతింటి కల నెరవేర్చడం కోసం జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఏడు లక్షల ఇళ్లను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రారంభోత్సవం చేయడం గర్వకారణమని కొనియాడారు. ఒక్కొక్క గృహం విలువ రూ.2.50 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు కూడా చేస్తుందని తెలిపారు. జగనన్న గృహాలు లబ్ధి పొందినటువంటి వారిని ఉద్దేశించి మాట్లాడారు. జగనన్న కాలనీలో సౌకర్యాలు సంపూర్ణంగా మెరుగుపరిచి రోడ్లు, వీధిలైట్లు, డ్రెయినేజీ తదితర ముఖ్యమైన సౌకర్యాలను కల్పించడంలో జగనన్న ప్రభుత్వం ముందుందని దాన్ని మీరు గుర్తించాలని కోరారు. జిల్లాలోని ప్రతి లేఔట్‌లోనూ మౌలిక వసతులు ఉండేటట్లు చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. త్వరలోనే ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వడం పూర్తి అవుతుందన్నారు. లేఔట్ లలో ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా ప్రభుత్వం పరిశీలన చేసి లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి సకాలంలో సిమెంటు ఇసుక, వంటి మెటీరియల్ అందజేసి త్వరితగతిన లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునే విధంగా ప్రోత్సహించడం జరిగిందన్నారు. దేశంలో ఎప్పుడు ఎక్కడ కని విని ఎరుగని రీతిలో మన రాష్ట్రంలో జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని ఇలాంటి మంచి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలన్నారు. నేడు రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉన్నారని అర్హులందరికీ పెన్షన్లు రేషన్ కార్డులు ఇవ్వడంతోపాటు ప్రతి నెల ఒకటవ తేదీనే అవతాతలకు తలుపు తట్టి పెన్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున ఇలాంటి మంచి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరు ఆశీర్వదించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా సామూహిక గృహప్రవేశ మహోత్సవంలో భాగంగా నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వారు ఇళ్లను పరిశీలించి లేఅవుట్‌లో మొక్కలు నాటారు. అనంతరం కాలనీ గృహాలను ప్రారంభించి నీటి కులాయిలు, విద్యుత్ వీధి దీపాలు వెలిగించి, శిలాఫలకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్ ఖాన్, హౌసింగ్ పీడీ సాంబశివ, గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ కారపాకల భాస్కర్ నాయుడు, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అగ్ర మొహిద్దీన్, మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్, ఎంపిడిఒ గంగయ్య యాదవ్, తహశీల్దార్ భాగ్యలత, జడ్‌పిటిసి పద్మజా లోకవర్ధన్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, ఎస్సీ సెల్ కార్యదర్శి వి.హరి, మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి నాయకులు మధు రెడ్డి, హనీఫ్, ఖాదర్బాషా, నరేష్, సమీర్ పాల్గొన్నారు

రబీకి 11 వేల క్వింటాళ్ల విత్తనాలు

ప్రజాశక్తి - రాయచోటి

2023-24 రబీ సీజన్ సన్నద్ధతలో భాగంగా జిల్లాలో 11 వేల క్వింటాళ్ల ఉలవ రాయితీ విత్తనాలను రైతులకు పంపిణీ చేశామని కలెక్టర్ గిరీష పి.ఎస్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్ రెడ్డికి వివరించారు. గురువారం వ్యవసాయం, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్, రెవెన్యూ, రీసర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ, ఎంపిఎఫ్‌సి గోడౌన్లకు భూ కేటాయింపు, ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీలో వేజ్ జనరేషన్, జల్ జీవన్ మిషన్, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి ఆయా అంశాలలో దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గిరీష పిఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాయితీ విత్తనాలు, ఎరువులు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని, వర్షాభావం కారణంగా రైతులందరూ సాగు పూర్తిగా చేయడం లేదని తెలిపారు. 2023-24కు సంబంధించి రబీ ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసిందని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే వందశాతం ఈక్రాప్ బుకింగ్, రైతు ఇకెవైసి పూర్తి చేశామన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని, రైతుల నుండి అందిన అభ్యంతరాలను అక్టోబర్ 23 లోపల పరిష్కరించి ఈనెల 25న ఆర్‌బికేలలో జాబితాను ప్రదర్శిస్తామని వివరించారు. గ్రామాలలో వివిధ ఉపాధి హామీ పనులు కల్పించాలని డ్వామా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జగనన్న పాల వెల్లువ క్రింద మహిళలకు రుణాలు, అలాగే పాడిరైతులకు సహకార బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతోందని చెప్పారు. జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ, పరిహారం చెల్లింపులను వేగవంతం చేస్తున్నామన్నారు. రీ సర్వేలో భాగంగా గ్రామాల సరిహద్దులు ఫైనలైజ్ అయిన చోట హద్దురాళ్లను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అసైన్‌మెంట్ మాడ్యూల్స్, సర్వీస్ ఇనాం మాడ్యుల్స్ ను నిబంధనల మేరకు లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

పాఠశాలల్లో డిఇఒ ఆకస్మిక తనిఖీ

10వ తరగతి విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి-పీలేరు

అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం పీలేరు మండలంలోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం మొదటగా ఆయన మండలంలోని ఎనుములవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ తెలుగులో 10వ తరగతి విద్యార్థులు, ఆంగ్లంలో 8వ తరగతి విద్యార్థుల భాషా సామర్థ్యాన్ని పరీక్షించారు. పిల్లలకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని కోటపల్లి జడ్పీ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులతో తాను హిందీ భాష ప్రావీణ్యతను పరీక్షించారు. పదవ తరగతి విద్యార్థుల ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్లంలో మంచి శిక్షణ అందించాలని, అదేవిధంగా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించాలని ఆదేశించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు ఉపయోగించి నూతన సాంకేతికను జోడించి విద్యార్థులకు బోధించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు ప్రతి గురువారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తర్వాత తినే విధంగా చూడాలని అన్నారు. రక్త హీనతున్న విద్యార్థులు ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భోజనం తర్వాత ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు తినే విధంగా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఒక మెసేజ్ ఇస్తున్నారని, దాని లింకును జిల్లాలోని అన్ని పాఠశాలలకు పంపుతామని, ఉపాధ్యాయులు వాటిని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డుల ద్వారా పిల్లలకు చూపించాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి, ఎనుములవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, కోటపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, రెడ్డి బాబు రెడ్డి, ఉపాధ్యాయులు అమర్నాథ రెడ్డి, మస్తాన్ సాహెబ్, వై.రెడ్డప్ప రెడ్డి, కృష్ణవేణి, నాగరాణి, శైలజ, సుధాకర్ బాబు, మధులత, రామకృష్ణ, ఉదయశ్రీ, అల్లా బక్సు, సిఆర్‌పిలు అశోక్, నాగరాజ పాల్గొన్నారు.

వేతనాల సమస్య పరిష్కారానికి కృషి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలోని ఉర్దూ అకాడమీ ఉద్యోగుల వేతనాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. గురువారం వాల్మీకిపురంలో జరిగిన జిల్లా ఉర్దూ అకాడమీ ఉద్యోగుల సమావేశంలో వేతనాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. పాతికేళ్ల నుంచి పనిచేస్తున్నా తమకు వేతనాలు పెంచడం లేదని, ఉపాధి హామీ పథకం కూలీల కంటే తక్కువగా తమ వేతనాలు ఉన్నాయని, కుటుంబ పోషణ కోసం అప్పుల ఊబిలో కూరుకు పోతున్నట్లు తెలిపారు. వేతనాలను పెంచి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ మాట్లాడుతూ ఉద్యోగుల వేతనాల పెంపుకు తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని, ఉర్దూ అకాడమీ బోర్డు సమావేశంలో ఈ విషయమై తీర్మానాన్ని ఆమోదించి చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులు ఉర్దూ అకాడమీ కుటుంబ సభ్యులని, ఉర్దూ అకాడమీ సేవలు విస్తృతం చేయాలంటే ఉద్యోగులు బాగుండాలని అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించి వారి జీవితాలకు భద్రత కల్పించారని, వైసిపి ప్రభుత్వ పాలనలో ఉర్దూ అకాడమీ ఉద్యోగులను 'కన్సాలిడేటెడ్ పే' ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించడం గమనార్హమన్నారు. ఉద్యోగుల వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని, వేతనాల పెంపుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఫోను ద్వారా రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ సెక్రటరీ మస్తాన్ వలీ దృష్టికి ఉద్యోగుల వేతనాల సమస్యను తీసుకెళ్లి, బోర్డు సమావేశంలోని అజెండాలో ఉద్యోగుల వేతనాల సమస్యను చేర్చాలని కోరారు. ఉర్దూ అకాడమీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వాల్మీకిపురం, మదనపల్లె, పుంగనూరు, కలికిరి, గుర్రంకొండ ప్రాంతాల్లోని ఉర్దూ అకాడమీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలీమ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

హామీల అమలు ఘనత సిఎం జగన్‌దే : 'గడికోట'

గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

మేనిఫెస్టో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు గురువారం మండలంలోని హసనాపురం గ్రామంలోని హసనాపురం, జింకలగుట్ట దళితవాడ, గొల్లపల్లె దళితవాడ, కట్టక్రింద హరిజనవాడ, రెడ్డివారిపల్లె, పప్పిరెడ్డిగారిపల్లె, కొండావాండ్లపల్లెలలో శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ, అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారికి పథకాలు అందేలా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సిఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. రెడ్డివారిపల్లె, పప్పిరెడ్డిగారిపల్లెలలో ముస్లింలు ఆయన స్వాగతం పలికారు. దివంగత ముఖ్య మంత్రి వైఎస్ఆర్ హయాంలో ముస్లిములకు నాలుగు శాతం రిజర్వేషన్లు, జగన్ పాలనలో ఉర్దూ ను రెండవ అధికార బాషగా గుర్తింపు చేశారన్నారు. మౌజం, ఇమామ్‌లకు గౌరవ వేతనాలను అందిస్తున్నారన్నారు. మైనారిటీ సబ్ ప్లాన్ తదితర ఎన్నో పథకాలను అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, జడ్‌పిటిసి వెంకటరమణ, మాజీ ఎంపిపి జనార్దన్‌రెడ్డి, క్లాస్‌వన్ కాంట్రాక్టర్, సీనియర్ నాయకులు పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బాల్య వివాహాలను అరికట్టి బాలికల నిష్పత్తిని పెంచాలని ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి అన్నారు. బాల్య వివాహాల చట్టంపై ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేటీ బచావో, బేటి పడావో అనే నినాదంతో 2014 అక్టోబర్‌లో పథకాన్ని ప్రారంభించి బాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న 100 జిల్లాలను ఎంపిక చేసి వారి నిష్పత్తిని పెంచేందుకు కావలసిన చర్యలు చేపట్టడం జరుగుతోందని పేర్కొన్నారు. జిల్లాను కూడా ఎంపిక చేశారన్నారు. ప్రతి 1000 మంది బాలికలకు 989 మంది బాలికలు మాత్రమే ఉన్నారని, ఆడపిల్లల మనుగడ, రక్షణ, సాధికారత దిశగా కృషి చేసేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని తెలిపారు. బాల్య వివాహాల చట్టంను సిఎంపిఒల ఆధ్వర్యంలో పకడ్బందీగా అమలు పరచనున్నట్టు తెలిపారు. బాల్య వివాహాల చట్టం-2006 జిఒ 31,39ను అమలు చేయాలని అధికారులకు సూచించారు. సిఎంపిఒలుగా మండల స్థాయిలో విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షకులు, మండల స్థాయి అధికారులు ఉంటారని.. వారు డివిజన్ స్థాయిలో సమన్వయం తో పని చేసే విధంగా విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం బాల్య వివాహల నిషేధ గోడపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో డివిజన్‌లోని అన్ని మండలాల అధికారులు, పోలీసు విభాగం, ప్రధానోపాధ్యాయులు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ వెంకటరమణ, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజయ్ బాబు అన్నారు. ఉర్దూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ అజయ్ బాబు ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కారాదని సూచించారు. విద్యార్థులు మంచి బాట ఎంచుకొని ఉన్నతమైన స్థానానికి ఎదగాలని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కారాదన్నారు. డాక్టర్ అఖిల్ సుప్రసాద్ మాట్లాడుతూ పిల్లలు చెడుదారిన పడకుండా తల్లిదండ్రులు చూపాలన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు వాడడం వలన ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. న్యాయవాది ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం, అమ్మడం, సేవించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ జిహెచ్ఎస్ చైర్మన్ ఎస్ఎండి కరీం, కళాశాల లెక్చరర్లు జాఫర్ హుస్సేన్, సాదిక్ భాషా, బాబా ఫక్రుద్దీన్, టౌన్ పీసీ రామాంజనేయులు, రత్నాకర్ పాల్గొన్నారు. **నందలూరు :** విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎఎస్ఐ శంకర్ నాయక్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యం వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి అధ్వర్యంలో గురువారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏటువంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై ఏకాగ్రత కలిగి ఉండాలని పేర్కొన్నారు. టీనేజ్ వయస్సులో ఒకరిని చూసి మరొకరు అసాంఘిక కార్యకలాపాలకు అలవాటు పడి తప్పు దోవలో వెళుతున్నారని, దాని వల్ల ఎన్నో రకాల అనర్థాలు కలుగుతామని పేర్కొన్నారు. ముఖ్యంగా డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వాటి జోలికి పోకుండా చదువులపై శ్రద్ధ వహించి, విద్యార్థి దశలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు వచ్చిన కలెక్టర్ గిరీషను తహశీల్దారు ధనుంజేయులు కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం తన పుట్టినరోజు సందర్భంగా కలెక్టర్ దంపతులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని, తిరుగు ప్రయాణంలో పీలేరు రోడ్లు భవనాల అతిథి గృహం చేరుకున్నారు. సమాచారం అందుకున్న పీలేరు తహశీల్దారు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని కలెక్టర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తహశీల్దార్ ధనుంజేయులు, రెవెన్యూ సిబ్బందికి కలెక్టరు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కలెక్టర్ గిరీష కలికిరికి బయలుదేరి వెళ్లారు.

ప్రపంచ దృష్టి దినోత్సవ వేడుకల్లో వెలుగు సిబ్బంది

'వెలుగు'లో ప్రపంచ దృష్టి దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, నేషనల్ ట్రస్ట్ వారి ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం అక్టోబర్ రెండవ గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించింది. స్థానిక వెలుగు సంస్థ దృష్టి లోపం ఉన్న చిన్నారులతో కలసి ఈ ప్రపంచ దృష్టి దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మొదటగా వెలుగు సిబ్బంది స్వీటీ ముఖ్య అతిథులను, వెలుగు సిబ్బందిని వేదిక పైకి ఆహ్వానించారు. శరీరానికి దీపం కన్ను అని, దీపం లేకుంటే అంతా అధకారమని కనుక మన రెండు కన్నులను జాగ్రత్తగా చూసుకోవాలని సిబ్బంది, పిల్లల చేత కొన్ని దృష్టికి సంబంధించిన చిన్న చిన్న వ్యాయామాలను చేసి వారి చేత చేయించారు. ప్రతి ఒక్కరిలో మనం మంచిని, గొప్ప విశిష్టతలను చూడాలని తెలిపారు. వెలుగు సిబ్బంది శ్రీజ మాట్లాడుతూ ఇప్పుడున్న డిజిటల్ కాలంలో ప్రతి ఒక్కరు సెల్ ఫోన్స్‌కి బానిస అయిపోయారని, దాని వాళ్ళ కళ్ళ సమస్యలు ఎన్నో వస్తున్నాయని తెలిపారు. ముందు ముందు చూపును కోల్పోయే ప్రమాదం ఉందని చెన్నారు. కనుక కళ్ళను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. సరైన ఆహారం, వ్యాయామం ద్వారా సమస్య రాకుండా చేసుకోవచ్చని తెలిపారు. కళ్ళ సమస్యతో బాధపడుతున్న వెలుగు విద్యార్థి తరుణ్ గీతాలాపన చేసి ప్రతి ఒక్కరిని అలరింపజేశాడు.

వార్డు అభివృద్ధే ధ్యేయం : 'కసిరెడ్డి'

ప్రజాశక్తి - రాయచోటి : ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధే తమ లక్ష్యమని 26వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ 26వ వార్డులో సమస్యలను గుర్తించి సిసి రోడ్లు, జగనన్న పక్కా గృహాలు, పింఛన్లు, వీధిలైట్లు, గర్ల్స్ హై స్కూల్‌లో నాడు నేడు పనులు, నూతన రేషన్ కార్డులు మొదలగు పనులు చేపట్టామని చెప్పారు. పట్టణ ప్రజలకు ఆరోగ్యకర వాతావరణం అందించాలనే ఉద్దేశంతో రూ.1.53 కోట్ల నిధులతో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్, ఫయాజ్ బాష సహకారంతో ఈనెల 7న డైట్‌లో పార్కును 500 మీటర్ల పొడవు గల సుందరమైన వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, జిమ్ సెంటర్, యోగ కేంద్రం, వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా లైటింగ్, సిసి కెమెరాలు , వాకర్‌లు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజులలో వార్డు, పట్టణానికి మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. 26వ వార్డు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

నేరాలకు అడ్డుకట్ట వేసి కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలని ఎస్‌పి బి.కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక డిపిఒలో జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రత్యేకించి పలు షీట్స్, గ్రేవ్ కేసులు, పీడీ యాక్టు, ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించి పరిష్కరించాలని తెలిపారు. కోర్టులో స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా షీట్స్‌లోని నిందితులకు తగిన శిక్షపడేలా కృషి చేయాలని చెప్పారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయాలని సూచించారు. దసరా నవరాత్రులు నేపథ్యంలో జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పలు షీట్స్‌లోని కేసులను సమీక్షించి, తీవ్ర నేరాలతో వున్న షీట్స్ లోని కేసుల దర్యాప్తు వివరాలు, కోర్టులో ఛార్జిషీట్ ధాఖలు, ప్రస్తుతం కోర్టులో ట్రయల్ ఏ దశలో ఉన్నాయి వంటి వివరాలు అడిగి తెలుసుకొని, సంబంధిత సీడీ ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కోర్టులో స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా షీట్స్ లోని నిందితులకు తగిన శిక్షపడే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. తీవ్ర నేరాల షీట్స్‌లోని వారిపై నిరంతర నిఘా ఉంచాలని తెలిపారు. యాక్టీవ్‌గా ఉన్న వారిని బైండ్ ఓవర్ చేయాలని సూచించారు. హత్య, రేప్, పోక్సో, ప్రాపర్టీ, గంజాయి మున్నగు గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు, ముద్దాయిలు అరెస్టులపై సర్కిల్ వారీగా పోలీసు అధికారులను ఆరా తీసి, అపరిష్కృతంగా ఉన్న గ్రేవ్ కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించి పరిష్కరించాలని పేర్కొన్నారు. కేసు నమోదు నుండి ఛార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని పేర్కొన్నారు. కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని తెలిపారు. పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చూడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వాహన తనిఖీలు చేపట్టి చలానాలు విధిస్తూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చేయాలని పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌పై దృష్టి సారించాలని తెలిపారు. రాత్రి గస్తీ పెంచి ఆస్తి నేరాలు జరిగే ప్రాంతాలపై నిఘా ఉంచి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. చోరీ సొత్తు రికవరీ పెంచాలన్నారు. శాంతి భద్రతలు విఘాతం కల్గిస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ఎక్కువ కేసుల్లో వున్న వారిపై పీడీ చట్టం ప్రకారం చర్యలు తీసుకొనుటకు ప్రతిపాదనలు పంపాలని పేర్కొన్నారు. రానున్న దసరా నవరాత్రులు నేపథ్యంలో జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు, క్షేత్రాలు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. వారి సమస్యలను ఓపికగా వినాలని తెలిపారు. చట్ట పరిధిలో న్యాయం చేయాలని చెప్పారు. ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకం కలిగే విధంగా సేవలు అందించాలని పేర్కొన్నారు. వారితో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డాక్టర్ బి.బి.రాజ్ కమల్ గారు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎంఇఒ శ్రీనివాసులు

విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించాలి

ప్రజాశక్తి-గాలివీడు

పిల్లలలో ఉన్న ప్రతిభను గుర్తించడానికి సైన్స్‌ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఇఒ2 వల్లెపు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. పదవ తరగతి ఇంగ్లీష్ మీడియంకు చెందిన సద్దల సుహాసిని టీం లీడర్ ఆధ్వర్యంలో కాంతి ప్రసరణ ఏ విధంగా జరుగుతుందో ప్రయోగం ద్వారా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గేశ్వరరాజు, స్కూల్ కమిటీ చైర్మెన్ కుందా లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు ప్రమీల, ఫైరోస్, జరీనా, రమణయ్య, వెంకటయ్య, రెడ్డయ్య, సోమ్లా నాయక్, గంగయ్య చక్రిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా కుమ్మక్కయి విద్యుత్ చార్జీలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డిలు ఘాటుగా విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా వైఖరికి నిరసనగా,పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలనే డిమాండ్ మీద, వామపక్ష పార్టీల పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా చైతన్య ప్రచార కార్యక్రమంలో భాగంగా, సిపిఐ బి.కొత్తకోట మండల సమితి ఆధ్వర్యంలో గురు వారం స్థానిక జ్యోతి చౌక్ నందు ప్రచార కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయ కులు ఎం.అష్రఫ్ అలీ,ఎస్.తంబయ్య శెట్టి,పి.నారాయణస్వామి, గంగులప్ప, బాబు, పి.మంజునాథ్, ఎం.చంద్రశేఖర్, కిట్టన్న, సోము, గంగాధ్రి పాల్గొన్నారు.

నేడు రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురం సచివాలయంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభం చేస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్రప్ప విశ్వనాథరెడ్డి, శ్రీవన్నారాయణ స్వామీ ఆలయ చైర్మన్ రెడ్డం నారాయణ, మాజీ సర్పంచ్ ఆర్ల సుబ్బయ్య తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మంలో రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చేతు మీదుగా ప్రారంభి స్తున్నట్లు వారు తెలిపారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట

నేడు మండల పరిధిలోని రంగంపల్లి గ్రామ సచివాలయంలో శు క్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపిపి, వైస్ ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండలస్థాయి నాయకులు, వార్డు మెం బర్లు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పాల్గొనాలని తెలిపారు.

కరపత్రాలను చూపుతున్న టిడిపి నాయకులు

చంద్రబాబు అరెస్టు అక్రమం

ప్రజాశక్తి-పెనగలూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేశారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ప్రధానరహదారిపై బాబుతో నేను కార్యక్రమంలో ఇంటింటికి కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబుతో నేను పేరుతో జరిగిన విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని చంద్రబాబుకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తామన్నారు. కక్ష పూరిత ధోరణితో చంద్రబాబును అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోవు ఎన్నికల్లో వైసిపి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షుడు పాపిరెడ్డిబాషా, నీరుగట్టు యానాదయ్య, కొత్తపల్లి కళ, చంద్ర, నాగేశ్వర నాయుడు, నాగినేని రాంప్రసాద్ నాయుడు, బాల రెడ్డయ్య, దానయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న మేనేజర్ ఎస్.అరుణ్

మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించండి

ప్రజాశక్తి-నందలూరు

ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఎస్.అరుణ్ కోరారు. గురువారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీలోని ఎర్రచెరువు కట్టపై వెల సిన శివాలయం వద్ద ఆజాది అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆఫీసర్ అడ్మిరల్ జనర్దర్, ఆఫీస్ అసిస్టెంట్ శ్రీరామ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దంతాలపై అవగాహన

చాపాడు: మైదుకూరు సెయింట్ ఆల్ఫోన్స్ బిగ్‌రి పాఠశాలలో విద్యార్థులకు దంతాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం రిమ్స్ డెంటల్ స్టూడెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ డెంటల్ వైద్యులు కె.నారాయణరెడ్డి మాట్లా డుతూ దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు దంత సమస్యల పై అవగాహన కల్గిఉండి, పరీక్షలు నిర్వహించారు. కార్యక్ర మంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మదీనా దస్తగిరి, రిమ్స్ డెంటల్ వైద్యులు జ్యోత్స్న, సుధాకర్, విజయలక్ష్మి పాఠశాల కరస్పాండెంట్ బాషా పాల్గొన్నారు.

హోమియోపతి మందులు పంపిణీ

చాపాడు: మండలంలోని నరహరిపురం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో గురువారం హోమియోపతి మందులు పంపిణీ చేశారు. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి హోమియోపతి వైద్యాధికారి రాజేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుతం వైరల్ ఫీవర్ ద్వారా పిల్లల బాధపడుతున్నారని, ఈ క్రమంలో ముందస్తు చర్యగా మందులు తినిపిస్తున్నామన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరసింహ శాస్త్రి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల చెంతకే వైద్య సేవలు : ఎంపిపి

వీరబల్లి : హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపిపి, సర్పంచ్

ప్రజాశక్తి-వీరబల్లి

జగనన్న సురక్షతో పేదల చెంతకే వైద్యసేవలు అందుతు న్నాయని ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఒదివీడు పంచాయతీ గ్రామ సచివాలయం దగ్గర సర్పంచ్ పోరుమామిళ్ల శంకరమ్మ తనయుడు శివ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నిరంతరం పేద ప్రజల క్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీదేవి, ఎంపిడిఒ మల్లేశ్వరి, మండల స్పెషల్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, మండల వైసిపి నాయకుడు వీరనాగిరెడ్డి, స్థానిక నాయకులు శివ, సుబ్బరా మరాజు పాల్గొన్నారు. **సుండుపల్లి :** ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మో హన్‌రెడ్డి అమలు చేస్తున్నారని మండల వైసిపి నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ముడుంపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఎం.రామ స్వామి రెడ్డి, జడ్‌పిటిసి బిఇస్మాయిల్, ఎంపిపి రాజమ్మ, జెసిఎస్ కన్వీనర్ రెహమాన్‌ఖాన్, సర్పంచ్ ఎం.రాణిమ్మ ,సుండుపల్లి-1 ఎంపిటిసి, నసీమ భాను,టి.సుండుపల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ సల్మాన్, రాష్ట్ర బిసి డైరెక్టర్ రాజు, సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌లు పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** జగనన్న ఆరోగ్య సురక్ష ఓ బృహత్తర కార్యక్రమ మని ఎంపిపి లక్ష్మీనరసమ్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బీరంగి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందిం చారు.ఈ సందర్భంగా ఎంపిపి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరుపేదల సంక్షేమానికి అలుపెరుగని కృషి చేస్తున్నారని, అందుకోసం అనేక వినూత్న పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రామ చంద్రయాదవ్, మండల ప్రత్యేక ఆహ్వానితులు రామిరెడ్డి, కో-ఆప్షన్ నెంబర్ ఎస్.నాసిర్‌వలి, బీరంగి సర్పంచ్ వెంకటరమణ, గుడిపల్లి సర్పంచ్ గిరిజ, తహసిల్దార్ రఫీక్ అహ్మద్, ఎంపిడిఒ శంకరయ్య, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **గాలివీడు :** ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే సంక ల్పంతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని వైస్ ఎంపిపి-1 మిట్టపల్లి యదుభూషణరెడ్డి పేర్కొన్నారు. కొర్ల కుంటలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిం చారు. వైద్యులు రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపిపి2 గాలి శ్రీనివా సులు, సర్పంచ్, ఎంపిడిఒ శేఖర్‌నాయక్ మండల కన్వీనర్ వెంక ట్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :**మండల పరిధిలోని పరసతోపు పంచాయితీలో సర్పంచ్ పర్వతమ్మ , ఎంపిటిసి సభ్యులు సరోజమ్మ కరీం ల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రజల ఆరోగ్యమే ఆశయంగా వినూత్న తరహాలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. డాక్టర్లు అనుపమ, ఆశాలతలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, ఎంపిడిఒ సురేంద్రనాథ్, శ్రీనివాసులు,రామ్మూర్తి పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లెలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. స్థానిక సచివాలయం ఆవరణలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి రవిచంద్ర, ఇఒపిఆర్‌డి లతీఫ్ ఖాన్, వైద్యాధికారులు మోహన్ ,జవహర్‌బాబు, కరీముల్లాబాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మదనపల్లె మండలం కొత్తపల్లి-1 గ్రామపంచాయతీ ఎంపియుపి పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి సిడిపిఒ సుజాత, ఎంపిటిసి దేవేంద్ర,ఎంపిడిఒ భాను ప్రసాద్, సచివాలయం స్పెషల్ ఆఫీసర్ చంద్ర కాంతమ్మ, వైసిపి కన్వీనర్లు మహేష్, నాగరాజులు హాజరయ్యారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది,వాలంటరీలు, ఎఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ కోతలు

9 నుంచి 7 గంటలకు కుదింపు - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వ్యవసాయ రంగానికి విద్యుత్ సమయం తగ్గింపుపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో 7 గంటల నుంచి 9 గంటలకు విద్యుత్ సమయం పెంచుతామని అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన వైఎస్ జగన్ 9 గంటల విద్యుత్‌ను ఇచ్చారు. అయితే ఇటీవల కాలంలో తరచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఎల్ఆర్ పేరుతో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. ఎప్పుడొస్తుందో చెప్పే పరిస్థితిలో లేమని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు తమ పంటలకు నీటి తడులు అందించేందుకు పొలాల వద్దనే ఉంటూ విద్యుత్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా గురువారం నుంచి విద్యుత్ సమయాన్ని 9నుంచి 7 ఏడు గంటలకు తగ్గిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సబ్‌స్టేషన్ సిబ్బంది విద్యుత్ సరఫరా సమయాన్ని తగ్గింపు సమాచారాన్ని రైతులకు తెలియజేస్తున్నారు. గతంలో మాదిరి కాకుండా విద్యుత్ 'ఎ' గ్రూపులో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 3:30 వరకు, 'బి' గ్రూపులో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

విద్యుత్ సమయం తగ్గింపుపై రైతుల ఆవేదన

విద్యుత్ శాఖ అధికారులు వ్యవసాయ రంగానికి రెండు గంటలు విద్యుత్ తగ్గింపు ప్రకటనపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గురిజాలోని విద్యుత్ సబ్‌స్టేషన్

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన వేరుశనగ, ఉద్ది ఇతర పంటలు తీవ్ర వర్షాభావంతో నీటి తడులు పంటలకు అందిస్తున్నారు. ఈ తరుణంలో విద్యుత్ సరఫరా సమయాన్ని తగ్గింపుపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తగ్గింపు

విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే విద్యుత్ సమయాన్ని తగ్గించాం. గతంలో ఇస్తున్న 9 నుంచి 7 గంటలకు తగ్గింపు చేశాం. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ ఎఇ సుబ్రహ్మణ్యం కోరారు.

ఎస్ఐ మెయిన్స్ పరీక్షకు గడువును పొడిగించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు మూడు నెలల గడువు ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేఖరుల సమా వేశంలో మాట్లా డుతూ ఎస్ఐ మెయిన్స్ వాయిదా వేయాలని దేహ దారుఢ్య పరీక్షల్లో అవక తవకలు ఉన్నాయని అభ్య ర్థులు ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని నిరుద్యోగ అభ్యర్థులకు అనుగుణంగా 14,15న జరిగే పరీక్షలు వాయిదా వేసేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. నాలుగేళ్ల పోరాట ఫలితంగా వచ్చిన 6,511 పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ వచ్చిం దన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి అనేక సమస్యలను సృష్టించి నిరుద్యోగుల గందరగోళానికి పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు అధికారులే కారణ మన్నారు. తక్షణమే పోలీస్ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మె యిన్ పరీక్షలకు గడువు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆలో చించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు, కార్యదర్శి ఎల్లయ్య, తులసీశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

పేదలందరికీ పండుగ రోజు : కలెక్టర్

ప్రజాశక్తి - వేంపల్లె

మన ఊరు బాగుండాలి, మన ప్రజలు, మన సమాజం బాగుండాలి అనే దృక్పథంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు వెళ్లాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు కోరారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ జగనన్న కాలనీల్లో 7.43 లక్షల నూతన గృహాలకు సామూహిక గృహ ప్రవేశం చేసే కార్యక్రమాన్ని గురు వారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోట జగనన్న కాలనీలో ప్రారంభించారు. ఇందులో భాగంగా వేంపల్లె పంచాయతీ పరిధిలోని 18.37 ఎకరాల్లో ఏర్పాటైన చింతలమడుగు పల్లె జగనన్న కాలనీ లేఅవుట్‌లో అన్ని వసతులతో రూపుదిద్దుకున్న గృహాలకు కలెక్టర్ గృహప్రవేశం చేసి లబ్ధిదారులతో సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు పేద ప్రజలందరికీ పండుగ రోజన్నారు. సొంతింటి కల సాకారమైన శుభదినం అన్నారు. చింతలమడుగుపల్లెలో 18.37 ఎకరాల్లో ఏర్పాటైన 500 ప్లాట్లలో 373 గృహాలు పూర్తయ్యాయన్నారు. ముందుగా కలెక్టర్ పలు గృహాల్లోకి వెళ్లి లబ్ధిదారులకు అభినందనలు తెలుపుతూ సంబరాల్లో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్లు గంగుల శైలజ, కె.లక్ష్మీ ఉష, ఎట్టి విజయలత, ఎంపిపి నల్లగారి గాయత్రి, జెడ్పిటీసీ మాచిరెడ్డి రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీ పఠాన్ రంతుల్లా ఖాన్, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, గండి దేవస్థానం చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, మాజీ ఎంపిపి గోగుల కొండయ్య, పులివెందుల ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణశాఖ పీడీ కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 43 మంది ఎంపిక

ప్రజాశక్తి - చక్రాయపేట

స్థానిక పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో 2020-2023 సంవత్సరంలో ఉత్తీర్ణత పొందిన 55 మంది విద్యార్థుల్లో 43 మంది అమరరాజు కంపెనీ ద్వారా ఉద్యోగం పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణయ్య పేర్కొన్నారు. గురువారం పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిత్తూరు జిల్లా బంగారుపాలెం అమరరాజా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఈశ్వరరావు, డిప్యూటీ మేనేజర్ గురునాథ్‌పాల్గొన్నారు. పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో వివిధ రకాల ఎలక్ట్రీషన్, పిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, తోపా విభాగాలకు 68 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిలో అమరరాజా కంపెనీకి 45 మంది ఎంపికయ్యారని తెలిపారు. నెలకు రూ.10,646 ఇస్తారన్నారు. ఉచితంగా భోజనవసతి, 70-80 కిలోమీటర్ల మధ్యలో ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కలదన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి లక్ష్మీనారాయణ, పారిశ్రామిక శిక్షణ కేంద్రం సిబ్బంది, ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని నాగులకట్ట వీధికి చెందిన రంగ రవికుమార్ (41) అనే అనాథ మృతదేహానికి గురువరం మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహిం చినట్లు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు తెలి పారు. రవికుమార్ అంతిమ సంస్కరణలు చేయడానికి ఎవరూ ముందుకు రాక పోవడంతో తాము స్పందించామన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి చేయూ తనిచ్చిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, భార్గవ్ సాయి, సుమన్ బాబు, సాయి, సుబ్బయ్య, శ్రీరామ్, ఐ.ఓబులేసు, ఓ.ఓబులేసుకు ధన్యవాదాలు తెలి పారు. తమ శ్రీఅమ్మ శరణాలయంలోని వృద్ధుల కోసం దాతలు 90008 79801, 82972 53484 నంబర్లను సంప్రదించాలని లక్ష్మణ్‌రావు కోరారు. **ప్రొద్దుటూరు :** మేముండగా ఎవరూ అనాథలు కారని మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ చైర్మన్ లక్షణ్‌మోరే అన్నారు. గురువారం నాగమల్లమ్మ (63) అనే అనాథ మృతదేహానికి వారు అంత్యక్రియలు నిర్వహించారు. నాగమల్లమ్మ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ అనారోగ్యంతో మృతి చెందింది. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు సాయంత్రం హిందూ స్మశానవాటికలో సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారం చేశారు. కార్యక్ర మంలో భాస్కర్, సుమన్‌బాబు, శ్రీరాం, సుబహాన్, సుబ్బయ్య పాల్గొన్నారు.

మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వైసిపి మండల కన్వీనర్, మండల ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొ న్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురు వారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి అరుణ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో రూ.10కోట్ల వ్యయంతో నూతనంగా తహశీల్దార్, ఎంపిడిఒ, కార్యాలయాలు పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పార్కు, నూతన ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. డిసెంబర్ నాటికి సింహాద్రిపురంలో జగనన్న కాలనీ ప్రారంభానికి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎఒ శివనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున రబీ సీజన్‌లో సాగే పంటలను కాస్త ఆలస్యంగా మళ్లీ వర్షాలు పడిన తర్వాత విత్తు కోవాలని సూచించారు. ఎంపిడిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కొంతమంది వాలంటీర్లు పనులు సక్రమంగా చేయడం లేదన్నారు. అలాంటి వారిని తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆహార సలహా కమిటీ చైర్మన్ అరవిందనాథరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, పిఆర్ ఎఇ ఉదయ్ కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్డి పద్మనాభరెడ్డి, ఉద్యానశాఖ విస్తరణాధికారి వీరారెడ్డి, ఎంఇఒ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని ఓబులరెడ్డిపేట గ్రామ పంట పొలాల్లో 2.75 కిలోమీటర్ల మేర రూ.27లక్షలతో వేయనున్న గ్రావెల్ రోడ్డుకు గురువారం ఎమ్మెల్యే ఎస్.రఘు రామిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల్లో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి రూ.22 కోట్లు ముఖ్యమంత్రి మం జూరు చేశారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చా మన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి సమ న్వయకర్త ఎస్.నాగిరెడ్డి, ఎంపిపి టి.లక్షుమయ్య, సింగిల్ విండో చైర్మన్ పాలగిరి వేమారెడ్డి, పెద్ద గురువలూరు సర్పంచ్ రాజేష్‌రెడ్డి, వైసిపి నాయకులు ఓబుళరెడ్డి, పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ప్రధానోపాధ్యాయులు స్టాలిన్, చెన్న కృష్ణమ్మ, రజిని, కృష్ణారెడ్డిలను హెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సాంఘిక శాస్త్రంలో విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు మోహన్‌రాజును అభినందించారు. సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు పట్టుశాలువా, పూలమాల, జ్ఞాపికలతో వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చెన్నూరు ఎంఇఒ గంగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం, గోల్డ్ మెడల్ అందుకుంటున్న చక్రవర్తుల శరత్

ఎన్‌సిసి డ్రిల్‌లో ఉత్తమ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చక్రవర్తుల శరత్, ఎన్‌సిసి ఎనిమిదవ కమాండ్ వార్షిక శిక్షణ శిబిరంలో నాలుగు జిల్లాల నుండి జూనియర్ డివిజన్ విభాగం డ్రిల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డి, ఎన్‌సిసి ట్రూప్ కమాండర్ పశువుల రాజశేఖర్ శరత్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 12 వరకు తిరుపతిలో కమాండ్ వార్షిక శిక్షణ శిబిరంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య నాలుగు జిల్లాలకు సంబంధించి డ్రిల్, మ్యాపు రీడింగ్, ఫైరింగ్ మొదలైన వాటిపై శిక్షణ పొందగా, జూనియర్ డివిజన్ విభాగంలో శరత్, ఎన్‌సిసి తిరుపతి గ్రూప్ కల్నల్ యోగేష్, డ్రుంగ్రకోటి, క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారని తెలిపారు. ఈ సంద ర్భంగా వారు శరత్‌ను అభినందించారు. కార్యక్రమంలో దుర్గరాజు, చంద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులు, జీవాలకు టీకాలు తప్పక వేయించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువులు, జీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస పాడి రైతులకు సూచించారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలో పశు వైద్య కేంద్రాన్ని గురువారం శ్రీనివాస తనిఖీ చేశారు. అనంతరం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆవు దూడలు, ఆవులు, కోడెలు, ఎద్దులలో ముద్ద చర్మ వ్యాధి సోకాకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. గొర్రెలు మేకలలో నీలి నాలుక వ్యాధి నివారణకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. పశు వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి, పాడి రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలకు వైద్యం చేశారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలో ప్రజా సమస్యలపై అధి కారులు దృష్టి సారించాలని కలసపాడు ఉప మండల అధ్యక్షుడు అన్నా రెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. గురు వారం స్థానిక బ్రాహ్మణపల్లెలో మండల వాలంటీర్ల అధ్యక్షులు, రాజుపాలెం పంచాయతీ కన్వీనర్ అమర్నాథ్ రెడ్డితో కలసి గ్రామ సమస్యల పై ప్రజాశక్తితో మాట్లాడారు. రైతులకు సకాలంలో ఎరువులు అందడంలేదని పేర్కొన్నారు. అందులో ఒక యూరియా తప్ప ఫాస్పేట్ టు సల్ఫేట్ ఇతరత్రా ఎరువులు ఎందుకు రావడం లేదని వారు తెలిపారు. దీని ద్వారా రైతులు చాలా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పెట్టిన పైరు సకాలంలో చేతికి రాక, వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రాలలో రైతులు తమ పంటలను నిల్వ ఉంచుకునేందుకు గిడ్డంగులను ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో టైల్స్ మల్లికార్జున, నిమ్మకాయల అమర్నాథరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డీలర్ బాల్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బాలయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటోను ఢీకొన్న కారు

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

ప్రమాదానికి గురైన కారు

ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని బాట వారిపల్లె పంచాయతీ కొత్తగాండ్ల పల్లికి చెందిన దేరంగుల వెంకట రమణ కుమారుడు దేరంగుల శివప్రసాద్ తన సొంత ఆటోలో అదే గ్రామానికి చెందిన కూలీలైన సరోజమ్మ, ఆదిలక్ష్మి, రాజమ్మ, అచ్చమ్మ, శారదమ్మ, పార్వతి, లక్ష్మీదేవి అను ఏడుగురిని ఆటోలో తీసుకుని వెళుతుండగా, స్థానిక పోతువారిపల్లి సమీపంలో పీలేరు-రాయచోటి జాతీయ రహదారిలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద, రాయచోటి వైపు నుండి వస్తున్న కారు ఆటోను వెనక వైపు నుండి ఢీకొట్టినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో ఆటో పల్టీలు కొట్టి ప్రక్కనే ఉన్న గోతిలో పడిందన్నారు. ఆటోలోని ప్రయాణికులకు రక్తగాయా లయ్యాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని బోరుబండ పండిత నెహ్రూ నగరకు చెందిన కారు డ్రైవర్ మహమ్మద్ అజీమ్ కుమారుడు మహమ్మద్ ముజీన్ నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగిందని తెలి పారు. ప్రమాద విషయం తెలుసు కున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరు కుని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలి పారు. ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ కుమార్ తెలిపారు.

14 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బిసి కాలనీ వద్ద గురువారం అక్రమంగా తీసుకు వెళుతున్న 14 మద్యం బాటిల్లను తీసుకెళుతున్న పుష్పగిరి రమాదేవి అనే మహిలను అరెస్టు చేసి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచపల్లి పంచాయతీ, గంగనేర్ కోటర్స్ చెందిన పుష్పగిరి రమాదేవి రామాపురం మండల కేంద్రం నుంచి రాచపల్లికి 14 మద్యం బాటాలను తీసుకు వెళ్తుండగా బీసీ కాలనీ పరిధిలోని గంగనేరు క్రాస్ వద్దకు రాగానే ముందస్తు సమాచారంతో తమ సిబ్బంది వెళ్లి దాడి చేసి అమే వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం పరుచుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.